క్లుప్తంగా

వినాయకుడికి ఎమ్మెల్యే 'గండ్ర' పూజలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ

శాయంపేట : వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మాందారిపేట గ్రామంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినాయకుడు ప్రజలను చల్లగా చూడాలని వేడుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు నాగరాజుతో పాటు స్థానికులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ లోకల్‌కోర్టు

వేలేరు : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శనివారం వేలేరు సబ్ స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్‌వీ.వేణుగోపాలచారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణగిరి, వేలేరు, భీమదేవరపల్లి, కొత్తకొండ, తదితర సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. లోకల్ కోర్టు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్చడం, విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు, లోఓల్టేజీ సమస్యలు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్‌లను మార్చడం, మీటర్ రీడింగ్, ఇతర సమస్యలతో పాటు కొత్త కనెక్షన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నడికూడ : మండలంలోని రామకృష్ణపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి ఇంద్ర, యార సంధ్యారాణి, ఎరుకల రాజు ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఉర్సులో కమాల్‌పాషా హవేలిలో హజ్రత్ సయ్యద్‌షా యాహియా పాషా నబీరా ఖాద్రీ సాహెబ్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రవక్త మహమ్మద్ జీవన సందేశంపై సమాజంలో శాంతి, సోదరభావం, సేవాభావం, సామరస్యాన్ని నెలకొల్పేలా ముస్లిం పెద్దలు ప్రసంగాలు చేశారు. మైనార్టీ మత పెద్దలతో కలిసి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్నారు. ముస్లింల ఆరాధ్య దైవమైన మహ్మద్ ప్రవక్తను మహ్మద్ షకీల్ హైమద్, మహ్మద్ మగ్దుం హైమద్, ఎండీ.నిసార్ హైమద్, గఫార్ స్మరించుకున్నారు.

రేషన్ దుకాణాల బంద్ విజయవంతం

ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో శుక్రవారం చేపట్టిన రేషన్ దుకాణాల బంద్ విజయవంతమైంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 13 మండలాల్లో రేషన్ దుకాణాలను డీలర్లు మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్‌కు వినియోగదారులు సైతం మద్దతు తెలిపినట్లు వారు తెలిపారు. పెరుగుతున్న ధరలు, షాపుల అద్దెలు, గుమస్తా భత్యం, విద్యుత్ బిల్లులు, ఇంటర్‌నెట్ చార్జీలు, దిగుమతి హమాలీ చెల్లింపుల భరించలేక పోతున్నామని డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ కోరారు.

ఎక్స్‌గ్రేషియా పెంపుపై కార్మికుల హర్షం

కాజీపేట రూరల్: భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా పెంపుపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కడిపికొండ బ్రిడ్జి కింద రైల్వే ఈఎల్ఎస్ పార్కులో శుక్రవారం సమావేశం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ యమడాల హనుకాంత్ పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీ.. రైతుకు ఉపకారి


డ్రోన్‌తో పురుగుమందు స్ప్రే చేస్తున్న రైతు


డ్రోన్ ఆన్ చేస్తున్న నిర్వాహకుడు

- యాంత్రీకరణపై రైతుల దృష్టి
- కూలీలు లేకుండా పంటసాగు
- ఒకపంపు మందు స్ప్రేకి రూ.500

ధర్మసాగర్ : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో ఆధునిక పరికరాల వినియోగం పెరుగుతుంది. పంటసాగులో రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ శ్రమను తగ్గించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతులతో పాటు సాంకేతిక పద్ధతులను పాటిస్తూ పంటలను సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యవసాయ రంగంలో పంటలకు సులభతరంగా మందులు పిచికారీ చేయడంలో డ్రోన్లు రైతులకు చాలా ఉపయోగకరంగా మారాయి. ఇప్పటికే వ్యవసాయంలో కూలీల కొరత ఏర్పడుతుండగా ఆధునిక పరికరాల వినియోగంతో రైతులకు కొంత మేర ఉపశమనం కలుగుతుంది. వర్షాకాలం సీజన్‌లో రైతులు చాలావరకు పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేయగా అవి కలుపు తీసే దశకు చేరుకున్నాయి. కాగా ఈ సమయంలో పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్ల నివారణకు వివిధ రకాల మందులను పిచికారీ చేసేందుకు రైతులు డ్రోన్లను వినియోగించేందుకు మొగ్గుచూపుతున్నారు. మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో డ్రోన్ల వినయోగిస్తూ సులభంగా పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. డ్రోన్ల వినియోగంతో రైతులకు సమయం ఆదా అవడంతో పాటు కూలీల అవసరం కూడా తగ్గుతుందని పలువురు రైతులు అంటున్నారు.

కూలీల అవసరం తగ్గింది



వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సమయం ఆదాతో పాటు కూలీల కొరత తప్పింది. నారాయణగిరిలో రెండు ఎకరాలు పత్తి సాగు చేశాను. పత్తి పంటకు వచ్చిన చీడపురుగుల నివారణకు మందులు తెచ్చి మూడు రోజులవుతుంది. మందులు పిచికారీ చేద్దామంటే కూలీలు దొరకడం లేదు. దీంతో డ్రోన్ నిర్వాహకులను సంప్రదించగా వారు రెండు ఎకరాల పత్తి పంటకు కేవలం 10 నిమిషాల్లో డ్రోన్‌తో పురుగుమందు స్ప్రే చేశారు. దీంతో డబ్బు, సమయం ఆదా అయింది.

దెబ్బేట సాంబరాజు, రైతు నారాయణగిరి

రైతులకు శ్రమ తగ్గుతుంది



పంటలకు, పండ్ల తోటలకు పురుగుమందుల పిచికారీలో రైతులకు డ్రోన్లు ప్రయోజనకరంగా మారుతున్నాయి. డ్రోన్లతో రైతులకు శ్రమ తగ్గడమే కాకుండా మొక్కలకు సరైన విధంగా మందులను స్ప్రే చేయడం కూడా సులభతరం అవుతుంది. రైతులు చేతిపంపులతో గంటల తరబడి మందులు పిచికారీ చేసే బాధ లేదు. డ్రోన్ సహాయంతో ఒక పంపులో సుమారు 12 లీటర్ల వరకు మందు కలుపుకోవచ్చు. దీంతో ఎకరం పంటకు మందు పిచికారీ చేయవచ్చు. ఒక పంపు మందు స్ప్రే చేసేందుకు కేవలం రూ.500 తీసుకుంటున్నాం.

శివకృష్ణ, డ్రోన్ నిర్వాహకుడు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


శాయంపేట : అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న చిన్నారి


దామెర : సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అంగన్‌వాడీ టీచర్ రత్నమాల పూలమాల వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ విద్యార్థిని టీచర్‌గా వ్యవహరించి చిన్నారులకు పాఠాలు బోధించారు. ఆశ వర్కర్, చిన్నారులు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాలలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతనం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య లక్ష్మీనివాసం మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలువేసేది ఉపాధ్యాయుడని కొనియాడారు. పాఠశాల డైరెక్టర్లు శోభారాణి, రాకేశ్ భాను, దినేశ్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పక్షిని రక్షించిన వేణు


బోన్‌లో ఉంచిన గుడ్లగూబ

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం స్టోన్‌క్రషర్ పరిసర ప్రాంతంలో అరుదైన రాక్ ఈగల్ (గుడ్లగూబ) గాయాలతో పడి ఉండగా శుక్రవారం అటుగా వెళ్తున్న పర్యావరణ ప్రేమికుడు వేణు గమనించి ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్‌కు సమాచారం అందించారు. సునీల్ వెంటనే హనుమకొండ జిల్లా అటవీశాఖ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్‌ఓ శిరిష, జూపార్క్ రేంజర్ మయూరికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అటవీశాఖ అధికారులు సిబ్బందిని సంఘటన స్థలానికి చేరుకుని గుడ్లగూబను సురక్షితంగా బంధించి జూపార్క్‌కు తరలించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా వేణును పలువురు అభినందించారు.

గణపయ్యకు ఘనంగా వీడ్కోలు


కమలాపూర్ : శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న మహిళలు


ఆత్మకూరు : కటాక్షపూర్ చెరువులో నిమజ్జనమవుతున్న గణపతి విగ్రహం


ధర్మసాగర్‌లో..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా గణపతి నిమజ్జనోత్సవ వేడుకలు శుక్రవారం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. తొమ్మిదిరోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఆసీనులు చేసి భక్తిశ్రద్ధలతో కోలాటం ఆడుతూ, నృత్యాలు, భజన చేస్తూ, పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా గణపతి బప్పా మోరియా నినాదాలతో చిన్నారులు, యువకుల కేరింతలు మిన్నంటాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ నిమజ్జనోత్సవాల్లో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, భక్త, భజన మండళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు 9 రోజులు వైభవంగా కొనసాగాయి. చివరిరోజు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. మల్లన్న ఆలయంలో ప్రతిష్టించిన గణపతిని మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చక సిబ్బంది నిమజ్జనం చేశారు.

శాయంపేట : మండలంలో గణపతి నిమజ్జనాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు డప్పుచప్పుళ్ల నడుమ గణపతి ఊరేగింపు నిర్వహించారు. సీఐ రంజిత్ రావు, ఎస్సై పరమేశ్ నిమజ్జన వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చెరువుల వద్ద భద్రతా ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని చెరువు, చలివాగు బ్రిడ్జి వద్ద ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని దేవుని చెరువు, ప్రగతి సింగారం బ్రిడ్జి వద్ద అధికారులు 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర చలివాగు బ్రిడ్జి వద్ద విధులు నిర్వహించారు.

ఎల్కతుర్తి : గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ దేవాలయంలో గల లక్ష్మీగణపతి స్వామివారిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పూజలు నిర్వహించి ఉద్వాసన మంత్రాలు పఠించారు. ఆలయ ఈఓ పి.కిషన్‌రావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అలాగే ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుడు తొమ్మిది రోజులపాటు నిత్యపూజలు అందుకున్నాడు. శుక్రవారం నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు, భక్తులు, మహిళలు, యువతులు కోలాటంతో సందడి చేసి శోభయాత్ర నిర్వహించారు. భక్తులు మంగళహారతులు ఇచ్చి నారికేళములు సమర్పించారు.

ఆత్మకూరు : తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఉదయం, సాయంత్రం పూజలు చేసి రకరకాల నైవేద్యాలు, మహా ప్రసాదాలు సమర్పించి తమ శక్తి కొలది మొక్కులు చెల్లించుకున్న భక్తులు మండలంలోని గణపయ్య నిమజ్జనం శుక్రవారం వైభవంగా జరిగింది. మండపాల వద్ద లడ్డూకు వేలం పాటలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ గణపతి నినాదాలతో శోభాయాత్ర నిర్వహించి కటాక్షపూర్ చెరువులో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఐ సంతోశ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై జానీపాషా ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.


ఎల్కతుర్తిలో..



శాయంపేటలో..


ఐనవోలులో..


ఆత్మకూరు : పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, సీఐ


ఆత్మకూరులో..


ఎల్కతుర్తిలో..


దామెరలో..

ప్రజలంతా సోదరభావంతో కలిసిఉండాలి

- కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి


కమలాపూర్ : భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, అధికారులు

కమలాపూర్ : కుల, మత, వర్గ బేధాలు లేకుండా ప్రజలంతా కలిసి మెలిసి, సుఖ సంతోషాలతో ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని విశ్వసాయి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకులు బాలసాని లత–రమేశ్‌గౌడ్, సాయితేజ గౌడ్ శుక్రవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ చేతన్ కుమార్‌రెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, స్థానిక ఇన్‌స్పెక్టర్ హరికృష్ణతో కలిసి ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నదానం గొప్పదని, అన్న ప్రసాద వితరణ దాతలను, యూత్ సభ్యులను అభినందించారు. అంతకుముందు గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. విశ్వసాయి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

- ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

వరంగల్ చౌరస్తా: రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రజా సమస్యలను విస్మరిస్తూ, ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో రాజా సాహెబ్ అధ్యక్షతన వరంగల్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తమకు అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను మాత్రమే జాబితాలో ఉంచి మిగతా వారి పేర్లను కేంద్రం తొలగిస్తోందని ఆరోపించారు. తన అధికార ప్రాబల్యాన్ని, నియంతత్వాన్ని కాపాడుకునేందుకు అడ్డదారిలో తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల్లో కొన్ని హామీలను మాత్రమే ప్రభుత్వం అరకొరగా అమలు చేస్తోందని అన్నారు. అధిక వర్షాలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, కుసుంబ బాబురావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మండల అధ్యక్షుడు చందు


మాట్లాడుతున్న చందు

నడికూడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చందు సూచించారు. శుక్రవారం మండలంలోని కౌకొండ, సర్వాపూర్, ధర్మారం గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజలకు వివరించాలని అన్నారు. యూరియా కష్టాలు, ఇందిరమ్మ ఇళ్ల తదితర పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో సుపరిపాలనే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని కొనియాడారు. నిత్యవసర ఆహార పదార్థలపై పన్ను శాతానికి తగ్గించిన ఘనతా మోదీకే దక్కుతుందన్నారు. బీజేపీ నాయకులు మొగిలి, స్వరూప, శ్రీకాంత్, తిరుపతి, రాజశేఖర్, సుమన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ


అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఝాన్సీరాణి, ఎంపీడీఓ

కమలాపూర్ : మండలంలోని వంగపల్లిలో రూ.12 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించే అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఎంపీడీఓ గుండె బాబుతో కలిసి ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అంతకుముందు మండలంలోని అంబాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీకి గణేశ్‌నగర్ కాలనీగా నామకరణం చేసి బోర్డు ఏర్పాటు చేశారు. ఏఎంసీ డైరెక్టర్లు ఓర్సు తిరుపతి, విజేందర్, మాజీ ప్రజాప్రతినిధులు రమేశ్, శ్రీకాంత్, రవి, రామస్వామి, సారయ్య, నాయకులు భిక్షపతి, డాక్టర్ కుమారస్వామి, తిరుపతి, శ్రీనివాసరావు, రాజిరెడ్డి, మొగిలయ్య, కాలనీ అధ్యక్షుడు సురేందర్, అశోక్, రవీందర్, రఘుపతి, పీఆర్ ఏఈ మధు పాల్గొన్నారు.

పూజారి సాంబయ్య మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న సిరిసిల్ల రాజయ్య

పరకాల : డీసీసీబీ మాజీ డైరెక్టర్ పూజారి సాంబయ్య మరణం కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను కలిచివేసిందని, ఆయన మరణం పార్టీకి తీరనిలోటని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. శుక్రవారం పూజారి సాంబయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సాంబయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. పూజారి సాంబయ్య కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషిచేశారని కొనియాడారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ భిక్షపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, రమే శ్, రవి, నాగరాజు, మోహన్, జెమిని పాల్గొన్నారు.

రైతులకు యూరియా సరఫరా చేయాలి

హన్మకొండ: రైతులకు తక్షణమే యూరియా సరఫరా చేయాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత వలన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వ్యవసాయ సహకార సంఘాల గోదాముల వద్ద ఎదురుచూస్తున్నారని తెలిపారు.

యోగా గురువుకు సన్మానం

విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, యోగా గురువు, రిటైర్డ్ ప్రొఫెసర్ జంగా గోపాల్‌రెడ్డిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు జాతీ య ఉపాధ్యాయ దినో త్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ ప బ్లిక్ గార్డెన్‌లో సన్మానించి అభినందనలు తె లి పారు.